సాక్షి శ్రీకాకుళం

శనివారం । 12 । ఏప్రిల్ । 2025



తగ్గిన దిగుబడులు

జీడి మామిడి దిగుబడులు తగ్గిపోతున్నాయి. రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 10లో



మాక్‌డ్రిల్.. సూపర్ థ్రిల్

జీరుపాలెంలో విపత్తుల శాఖ వారు మాక్‌డ్రిల్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితులను వివరించారు.

- 10లో

నేడు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు తెరిచే ఉంటాయి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలోగల 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు రెండో శనివారం అయినా పనిచేస్తాయని జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ ఎ.నాగలక్ష్మి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు శనివారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు రిజిస్ట్రేషన్లు యథావిధిగా పనిచేస్తాయన్నారు. క్రయ.విక్రయదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

పత్రికలపైనా రెడ్‌బుక్ రాజ్యాంగమేనా..?

- 'సాక్షి' ఎడిటర్‌పై కేసు పెట్టడం సరికాదు
- ఈ వైఖరి ప్రజాస్వామ్య మనుగడకే ముప్పు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: ప్రజాస్వామ్యంలో పత్రికల గొంతుకను నొక్కేందుకు కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడం సరికాదని, పత్రికలపైనా రెడ్‌బుక్ పాలనేనా అని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు మరికొందరిపై పోలీసులు కేసు పెట్టడం దారుణమన్నారు. నీతులు వల్లించే వారికి ఈ దాడులు గురించి తెలియదా అని ప్రశ్నించారు. ఇదే విధంగా గత ప్రభుత్వ కాలంలో పచ్చ పత్రికల రాతలపై కేసులు పెడితే ఆ పత్రికాధిపతులు ఏమైపోయేవారని అన్నారు. పత్రికా స్వేచ్ఛ అందరికీ సమానమేనని అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన చేశారు. ప్రస్తుతం ప్రజల గొంతుకగా 'సాక్షి' పనిచేస్తుందని, దీన్ని అణిచివేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. ఈ చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపు నిచ్చారు. కూటమి పాలన ఎమర్జెన్సీకి మించిపోయిందన్నారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

శ్రీకాకుళం: ఆస్పత్రుల్లో పేషెంట్లకు నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలని జిల్లా ఫుడ్ కంట్రోల్ అధికారి కె.వెంకటరత్నం కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కుటుంబసంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రిమ్స్ ఆసుపత్రిలో పేషెంట్లకు సరఫరా చేసే ఆహారాన్ని శుక్రవారం ఆస్పత్రి డైటీషియన్ సమక్షంలో ఆయన పరిశీలించారు. ఆహారం సరఫరా చేసేందుకు లైసెన్స్ పొందాలన్నారు. వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రులకు వచ్చే వారికి నాణ్యత లేని ఆహారం సరఫరా చేస్తే వారి ఆరోగ్యం మరింత క్షీణిస్తుందన్నారు. ఈ పరిశీలనలో ఫుడ్ సేఫ్టీ సహాయాధికారి లక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



అక్షరాగ్రహం

- కూటమి ప్రభుత్వం పై జర్నలిస్టుల మండిపాటు
- సాక్షి ఎడిటర్‌పై కేసు తగదని హితబోధ



టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

శ్రీకాకుళం, శ్రీకాకుళం క్రైమ్ : కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అక్రమాలను అక్షర రూపంలో నిగ్గు తేల్చుతున్న 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి, మరో ఆరుగురు జర్నలిస్టులపై పోలీసుల చేత క్రిమినల్ కేసులు పెట్టించడం అత్యంత హేయమైన చర్య అని, అక్షరంపై జరిగే దాడిగా దీన్ని అభివర్ణించవచ్చని శ్రీకాకుళం జర్నలిస్టుల సంఘాలు నిరసనలు తెలిపాయి. ఇలాంటి కక్షపూరిత దాడులు చంద్రబాబు ప్రభుత్వంలోనే జరుగుతుండటంతో మరోసారి భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించాయి. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని ఏడు రోడ్ల కూడలిలో శుక్రవారం జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు ధర్నా, మానవహారం, ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కొంక్యాణ వేణుగోపాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు కార్యవర్గ సభ్యులు ఎస్.ఈశ్వర రావు, ఏపీయూడబ్ల్యూజే సీనియర్ సభ్యులు జీవీ నాగభూషణరావు సీనియర్ జర్నలిస్టులు గిరి రంగనాథ్, ఉరిటి శ్రీనివాస్, పైడి చినప్పలనాయుడు, కస్పా ధర్మారావు, వీవీఎన్ శ్రీనివాస్, బగాది అప్పలనాయుడు, మామిడి రవి, సీపాన నాగభూషణరావు, దువ్వూరి గోపాలరావు, ఎల్లాపంతుల శ్రీనివాసరావు, పైడి అప్పలనాయుడు, భవానీ చంద్ర ప్రసాద్ పాత్రో, జక్కా మన్మధరావు, డి.నారాయణరావు, సీహెచ్ దేశరాజు, పీసీహెచ్ శివాజీ, నరసింహం, షణ్ముఖరావు, శ్రీనివాస్, శివప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించేవారిని భయపెట్టి..



కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అక్రమాలను నిర్భయంగా, నిజంగా ప్రశ్నించే జర్నలిస్టులపై కేసులు పెట్టి భయపెట్టడం తీవ్రచర్యగా పరిగణించాలి. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా దీనిపై కఠినంగా వ్యవహరించాలి. జర్నలిస్టులకు అండగా నిలబడి నివారణ చర్యలు చేపట్టాలి. కేసులు ఎత్తివేయాలి. – జీవీ నాగభూషణరావు, ఏపీయూడబ్ల్యూజే సీనియర్ సభ్యులు



శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

పత్రికా స్వేచ్ఛకు భంగం



సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, మరో ఆరుగురు జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టడం హేయమైన చర్య. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించినట్లే. సామాజిక అంశాలపై పత్రికా ధర్మాన్ని పాటిస్తూ జర్నలిజానికి ఊపిరిపోస్తున్న మేధావులపై దాడిగా దీన్ని అభివర్ణించవచ్చు. భేషరతుగా వారిపై కేసులు ఎత్తివేయాలి.

– ఎస్.ఈశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించాల్సిందే



కూటమి ప్రభుత్వం వచ్చాక డే-1 నుంచి మీడియాపై ప్రతీకార దాడులు, కేసులు పెడుతున్నారు. చూస్తుంటే రాజకీయ కోణంలోనే సాక్షి ఎడిటర్‌పై కేసుపెట్టినట్లు అర్థమవుతోంది. చంద్రబాబు ప్రభుత్వం గతంలోనూ ఇలానే చేసి మూల్యం చెల్లించింది. ఇప్పుడూ తప్పదు.

– కొంక్యాణ వేణుగోపాల్, ఏపీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి

ఇలాంటి సంస్కృతి ఏ రాష్ట్రంలోనూ లేదు..



పత్రికా విలేకరి ఎవరైనా కథనం రాస్తే అవతలివారికి పరువు భంగం కలిగిందనుకుంటే లీగల్‌గా వెళ్లవచ్చు. కానీ రాసే వార్తను ఆధారంగా చేసుకుని ఎడిటర్లపైన, యాజమాన్యాలపైన క్రిమినల్ కేసులు పెట్టే సంస్కృతి ఏ రాష్ట్రంలోనూ లేదు. మనకే ఆ దౌర్భాగ్యం. ఒక రాష్ట్రంలో నమోదైన ఫిర్యాదు, ఎఫ్ఐఆర్ మరో రాష్ట్రంలో మరో విధంగా నమోదు కావడం అన్యాయం. కూటమి ప్రభుత్వం ఇకనైనా ఇలాంటివి విరమించి రాజ్యాంగ పరిధిలో పనిచేస్తున్నామన్న సందేశమివ్వాలి.

– నల్లి ధర్మారావు, స్వామ్నా రాష్ట్ర అధ్యక్షులు, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు

డయాలసిస్ సేవలకు అంతరాయం



- తీవ్రంగా ఇబ్బంది పెట్టిన విద్యుత్ అంతరాయాలు
- ఆరుసార్లు ఆగిపోయిన డయాలసిస్ యంత్రాలు



నెఫ్రోప్లస్ యూనిట్‌లో పరిస్థితి ఇలా..

కాశీబుగ్గ: పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్‌లో శుక్రవారం డయాలసిస్ సేవలకు అంతరాయం ఏర్పడింది. 20 బెడ్‌లతో ఉన్న సముదాయాన్ని నెఫ్రోప్లస్ సంస్థవారు నడుపుతున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి విద్యుత్ సమస్యతో అన్ని డయాలసిస్ మిషన్‌లు ఆరు సార్లు ఆగిపోయాయి. సాయమ్మ అనే పేషెంట్ ఉదయం పదకొండు గంటలకు వచ్చినా రాత్రి ఏడుగంటల వరకు ఉంచేయడంతో ఆయాసం అధికమై ప్రాణాప్రాయ స్థితికి చేరుకుంది. నెఫ్రోప్లస్ వారు నిర్వహిస్తున్న ఈ యూనిట్‌లో జనరేటర్ ఉన్నప్పటికీ సాంకేతిక సమస్య తలెత్తడంతో అక్కడి సిబ్బంది పరిస్థితిని చక్కదిద్దలేకపోయారు. డయాలసిస్ కేంద్రంలో ఎలక్ట్రీషియన్ లేకపోవడంతో తిరిగి ప్రభుత్వం నియమించిన కిడ్నీ ఆస్పత్రి ఎలక్ట్రీషియన్‌తో మరమ్మతులు చేయించారు. ఇదే విషయం ఆస్పత్రి సూపరింటెండెంట్ వద్ద ప్రస్తావించగా ఇంతవరకు ఇలాంటి సమస్య రాలేదని, మరమ్మతులు చేసినప్పటికీ పలుమార్లు ట్రిప్ అవ్వడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అన్నారు. ఇకపై ఇలా జరగకుండా చూసుకుంటామని అన్నారు.

అటు ఆళ్వారు.. ఇటు ఆదిత్యుడు



తోట మండపంలో విశ్రాంతి తీసుకుంటున్న కల్యాణమూర్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 'దొంగదోపు ఉత్సవం' ఆకట్టుకుంది. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఉద్యానవన తోటల్లో జరిపించిన ఈ వేడుకల్లో భాగంగా ఆలయం నుంచి శ్రీ ఉషా పద్మిని ఛాయాదేవేరులతో శ్రీసూర్యనారాయణ స్వామి వారి కల్యాణమూర్తులను వెండి సింహవాహనంలో తిరువీధిగా మాడవీధుల నుంచి ఉద్యానవన తోట (చిన్నతోట)లో వేంచేసింపజేశారు. అలాగే మరో ఉద్యానవన తోట (పెద్దతోట)లో శ్రీ తిరుమంగ యాళ్వారు చరిత్రలో భాగంగా ఆళ్వారును ఆశీనులు చేశారు. అనంతరం ఆళ్వారుకు, ఆదిత్యునికి మధ్య జరిగిన సంవాదం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆదిత్యుని తరఫున భాస్కరభట్ల నర్సయ్య శర్మ, బంకుపల్లి రమేష్‌శర్మ, ఆళ్వారు తరఫున భాస్కరభట్ల శ్రీరామమూర్తి శర్మ, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావులు సంవాదం చేసుకున్నారు. శనివారం ఉదయం చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఇంద్రపుష్కరిణిలో స్వామి వారి కల్యాణమూర్తుల చక్రతీర్థ స్నానాల కార్యక్రమం జరుగనుందని, అలాగే రాత్రి పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈఓ వై.భద్రాజీ తెలియజేశారు.

ఆరోగ్య సేవలు విస్తృతం చేస్తాం

- నూతన డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిత
- తనను విధుల నుంచి తప్పించాలని వేడుకున్న డాక్టర్ సుజాత



డీఎంహెచ్‌ఓ అనితకు అభినందనలు తెలుపుతున్న ఏఓ బాబూరావు, సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్యశాఖకు మంచి పేరు తీసుకొచ్చేందుకు తనవంతుగా కృషి చేస్తానని డాక్టర్ కె.అనిత స్పష్టం చేశారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిగా ఆమె శుక్రవారం పూర్తి అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె ముందుగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలో పలు విభాగాల అధికారులతో పలు కీలకాంశాలపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో అత్యధిక సర్వీసు చేశానని, ఇప్పుడు శ్రీకాకుళం జిల్లాలో అవకాశం రావడాన్ని సంతృప్తిగా స్వీకరిస్తున్నానన్నారు. జిల్లాలో ఉన్న అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో వైద్య సేవలను మరింత విస్తృతం చేసేలా విజిట్స్ ఉంటాయని స్పష్టం చేశారు. ప్రతి 14 రోజులకొకసారి పీహెచ్‌సీ పరిధిలో ఫ్యామిలి డాక్టర్ కాన్సెప్ట్ అమలు చేయాలన్నారు. జిల్లాలో వైద్యశాఖకు ఇటీవల చెడ్డపేరు వచ్చిందన్న అంశాన్ని ప్రస్తావించగా, కచ్చితంగా మార్పు చూపిస్తామని, వచ్చే వారం మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష చేయనున్నట్లుగా సమాచారం వచ్చిందన్నారు. ఈమేరకు సన్నద్ధం చేస్తున్నామన్నారు.

ఈనెల 9వ తేదిన జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిగా విశాఖపట్నం రీజనల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ బి.సుజాతను నియమిస్తూ వైద్యశాఖ డైరక్టర్ డాక్టర్ బందారు సుబ్రహ్మణేశ్వరి రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. అయితే ఈమె జిల్లాలో డీఎంహెచ్‌ఓగా విధుల్లో చేరలేనని, తనని తప్పించాలని కోరుతూ విన్నవించుకోగా.. ఆ ఉత్తర్వులను రద్దు చేస్తూ తదుపరి శ్రీకాకుళం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో ఆర్‌ఎంఓగా విధుల్లో ఉన్న డాక్టర్ కె.అనితకు ఎఫ్ఏసీ బాధ్యతలను అప్పగిస్తూ గురువారం రాత్రి కొత్త ఉత్తర్వులను డైరక్టరేట్ జారీ చేసింది.

ఘనంగా పూలే జయంతి



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ధర్మాన సోదరులు

శ్రీకాకుళం రూరల్: పెదపాడులోని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జ్యోతిరావు పూలే 119వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్‌లు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మామిడి శ్రీకాంత్, గేదెల పురుషోత్తం, రౌతు శంకరరావు, అంబటి శ్రీను, ఎచ్చెర్ల శ్రీధర్, గొండు రఘురామ్, చిట్టి జనార్దన్‌రావు, పీస గోపి, ముంజేటి కృష్ణ, మెంటాడ స్వరూప్, రుప్ప అప్పలసూరి, బగ్గు అప్పారావు, యాల నారాయణ, మార్పు పృథ్వీ, గుండ హరేష్, బరాటం బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

128 మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లు, నిందితుడితో పోలీసులు

జి.సిగడాం: ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి బెల్టు షాపునకు అక్రమంగా తరలిస్తున్న 128 మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. జి.సిగడాం గ్రామానికి చెందిన సరిగుడి గోవిందరావు శుక్రవారం అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తుండగా ఎస్సీఆర్ పురం వద్ద ఎస్ఐ మధుసూదనరావు వాహనాల తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసి గోవిందరావును కోర్టుకు తరలించారు.

పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. పిల్లలంతా ఇంట్లో కంటే గ్రౌండ్‌లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. మరికొద్ది రోజుల్లో వార్షిక పరీక్షలు కూడా ముగియనున్నాయి. సెలవులు వస్తే ఆ సందడి చెప్పనక్కర్లేదు. ఇప్పటికే ఓపెన్ టోర్నీలు, లీగ్ మ్యాచ్‌లతో మైదానాలు కళకళలాడుతున్నాయి. శిక్షణ శిబిరాలు కూడా మొదలు కానున్నాయి. అభిరుచిని బట్టి విద్యార్థులు కొత్త కొత్త కళలు, ఆటలు నేర్చుకునేందుకు ఇవి దోహదపడతాయి. – శ్రీకాకుళం న్యూకాలనీ, శ్రీకాకుళం కల్చరల్

హాలీడేస్.. జాలీడేస్



టోర్నీలు, లీగ్ మ్యాచ్‌లతో హడావుడి

- జిల్లాస్థాయి, ఓపెన్ టోర్నీలు, లీగ్ మ్యాచ్‌ల సన్నద్ధతతో మైదానాల్లో సందడి
- క్రీడాసామగ్రి విక్రయాలతో స్పోర్ట్స్ షాపులు కళకళ
- వేసవిలో మైదానాల బాట పడుతున్న విద్యార్థులు
- మరికొద్ది రోజుల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మొదలు

ఆటాడుకుందాం.. రా అంటూ మైదానం పిలుస్తోంది. ఇప్పటికే ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలు ముగిశాయి. మరికొద్ది రోజుల్లో చిన్నారులకు వేసవి సెలవులు సైతం ప్రారంభం కానున్నాయి. ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీ పట్టిన చిన్నారులు, విద్యార్థులు మైదానం బాట పట్టేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. దీనికితోడు ఐపీఎల్ మేనియా బాగా పనిచేస్తోంది. తమ అభిమాన ఆటగాళ్లను అనుకరిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా మైదానాల్లో సందడి..

ఆటపాటలతో మైదానాల్లో ఇప్పటికే సందడి మొదలైంది. ముఖ్యంగా జిల్లా కేంద్రంతో పాటు కళింగపట్నం, సింగుపురం, ఇచ్ఛాపురం, సోంపేట, మకరాంపురం, పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం, టెక్కలి, నరసన్నపేట ఆమదాలవలస, ఎచ్చెర్ల, రణస్థలం తదితర ప్రాంతాల్లోని క్రీడాకారులు, విద్యార్థులు, యువత, చిన్నారులు మైదానాల్లో సందడి చేస్తున్నారు. వివిధ క్రీడాంశాల్లో నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకునేందుకు రెడీ అయిపోతున్నారు. దీనికితోడు త్వరలో మొదలయ్యే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను కూడా వినియోగించుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. మరికొంతమంది త్రివిధ దళాల్లో ఉద్యోగాలకు దేహ దారుఢ్యాన్ని పెంచుకోవడంలో తలమునకలవుతున్నారు.



క్రికెట్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

వేసవి సెలవుల్లో భాగంగా యువత, విద్యార్థులు పలు క్రీడాంశాల్లో మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి, అంతర్‌రాష్ట్ర క్రీడా టోర్నీలు, లీగ్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు ఇప్పటికే ప్రణాళిక వేస్తున్నారు. కొన్ని చోట్ల టోర్నమెంట్లను కూడా మొదలుపెట్టేశారు. ముఖ్యంగా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రీడాంశాల్లో టోర్నీలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీటితోపాటు ఫుట్‌బాల్, చెస్, క్యారమ్స్, కరాటే, తైక్వాండో, జూడో క్రీడాంశాల్లోను పోటీలకు కసరత్తులు చేసుకుంటున్నారు.

ఎండలతో జాగ్రత్తలు తప్పనిసరి..



మండే ఎండల నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుత ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉదయం గరిష్ఠంగా 10.30 వరకు, మధ్యాహ్నం 3.30 గంటల తర్వాత మాత్రమే మైదానాల్లో ఆడుకోవడం ఉత్తమం. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు గ్లూకోజ్, నిమ్మరసం, ఆరెంజ్ వంటి ద్రావణాలను అధిక మోతాదులో తీసుకోవాలి. కొబ్బరిబొండాలు, మజ్జిగ తీసుకోవడం మంచిది.

– డాక్టర్ బొడ్డేపల్లి సురేష్‌కుమార్, వైద్యులు, సన్‌రైజ్ హాస్పటల్ ఎండీ శ్రీకాకుళం

మన్నికైనవి వాడాలి..



క్రీడాదుస్తులు, క్రీడా సామగ్రి కొనుగోలు చేసే సమయంలో కచ్చితంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నకిలీ సామగ్రి కూడా వచ్చేస్తున్నాయి. ఒకటికి రెండుసార్లు చూసి కొనుక్కోవాలి. మన్నికైనవి తీసుకుంటే ఎక్కువ రోజులు వినియోగించవచ్చు.

– ముజ్జాడ వెంకట రమణ, సీనియర్ పీడీ, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు



ఇక్కడే అన్నీ..

ఒకప్పుడు స్పోర్ట్స్ మెటీరియల్స్ కోసం విశాఖ తదితర ప్రాంతాలకు వెళ్లేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జిల్లా కేంద్రంలో విస్తారంగా స్పోర్ట్స్ దుకాణాలు వెలిశాయి. క్రీడా దుస్తుల విక్రయాలతో పాటు క్రికెట్ కిట్లు (బాల్స్, బ్యాట్స్, ప్యాడ్స్, గ్లోవ్స్, ఇతరాలు), వాలీబాల్, షటిల్ రాకెట్స్ మొదలుకుని క్రీడా సామగ్రి విక్రయాలతో షాపుల్లో సందడి వాతావరణం నెలకొంది. వీటితోపాటు ఫిట్‌నెస్ మెరుగు కోసం వివిధ యాంత్రిక పరికరాలు, బండిల్స్ విక్రయాలు కూడా జరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

గెలుపోటములు ఒకటే..



అటు టెన్త్, ఇటు ఇంటర్ పరీక్షలు ముగిశాయి. తదుపరి ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమవుతూనే.. విద్యార్థులు ఆటలపోటీల్లో నిమగ్నమవుతున్నారు. ఆటలన్నాక గెలుపోటములు సహజం. ఈ రోజు ఓటమి రేపటికి గెలుపునకు నాంది. రెండింటినీ సమానంగా తీసుకోవాలి. తోటి ఆటగాళ్లపై స్నేహ భావంతో మెలగాలి.

– సంపతిరావు సూరిబాబు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా సీఈఓ

సమ్మర్ క్యాంప్‌లు ఇలా..

- శ్రీకాకుళం పట్టణంలో నృత్యం నేర్చుకోవాలనుకువాళ్లకు సంప్రదాయం కూచిపూడి గురుకులం, కళ్లేపల్లిలో కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతంపై వేసవి శిక్షణ తరగతులు మే 1 నుంచి జూన్ 5 వరకు జరుగుతాయి.
- పట్టణంలోని పాతశ్రీకాకుళం కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రాయింగ్‌పై ఉచిత వేసవి శిక్షణ నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ ఎల్.నందికేశ్వరరావు తెలిపారు. ఈ నెల 28 నుంచి జూన్ 5 వరకు నిర్వహిస్తారు.
- రఘుపాత్రుని శ్రీకాంత్, శివశ్రీ నృత్య కళానికేతన్, న్యూసెంట్రల్ స్కూల్స్‌లో మే 1నుంచి జూన్ 5 వరకు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యం కూడా నేర్పుతారు.
- శాంతినగర్‌లో ఎన్‌పీ కవిత, అభినయ నృత్య నికేతన్‌లో తిమ్మరాజు నీరజ, శృతిలయ సంగీత నిలయంలో రెడ్డి సత్యనారాయణ, సుసరాపు లక్ష్మీగణపతి శర్మ, శ్రీరాజరాజేశ్వరీ సంగీతం పీఠంలో శాస్త్రీయ నృత్య, సంగీతాలు నేర్పిస్తారు.
- అకీరా డ్యాన్స్ ప్లానెట్స్‌లో చిన్నారుల కోసం వేసవి శిబిరం నిర్వహిస్తున్నారు. ఇక్కడి స్పోకెన్ ఇంగ్లిష్, యోగా, అబాకస్, చెస్, డ్రాయింగ్, వెస్టర్న్ డ్యాన్స్, భగవద్గీత, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నేర్పుతారు.
- పట్టణంలో పాండురంగవీధిలో ఉన్న వీఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో కీబోర్డు, గిటార్, వోకల్ శిక్షణ ప్రారంభమైంది. మాస్టర్ సిహెచ్. వేంకటరావు ఆధ్వర్యంలో వేసవిలో రెండు నెలలపాటు ఈ శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.



సంగీత నిలయంలో సాధన(ఫైల్)



డ్రాయింగ్ వేస్తున్న చిన్నారులు (ఫైల్)

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


నుజ్జయిన బొలెరో వాహనం

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఒడిశా నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న బొలెరో వాహనం టెక్కలి మండలం కె.కొత్తూరు సమీపంలో రహదారిపై ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బొలెరోలో ఉన్న ఒడిశా క్లీనర్ జితేంద్ర సాహు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

విప్లవ పోరాట యోధుడు పైలా


పైలా స్మారక స్థూపం వద్ద విప్లవ జోహార్లు చేస్తున్న ప్రజా సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: వర్తమాన భవిష్యత్ విప్లవ పోరాటాలకు నిత్య చలనశీలతను రగిలించే పోరాట యోధుడిగా కామ్రేడ్ పైలా వాసదేవరావు నిలిచారని న్యూడెమొక్రసీ పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాశరావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం రిట్టపాడులో శుక్రవారం పైల వాసదేవరావు వర్ధంతి నిర్వహించారు. పైలా స్మారక స్థూపం వద్ద పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, అభిమానులు విప్లవ జోహార్లతో ఘన నివాళులు అర్పించారు. వాసుదేవరావు ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ నెల 13న పలాసలో న్యూడెమొక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పైలా స్మారక సభ జరుగుతుందని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, ప్రజా సంఘ నాయకులు, కుటుంబ సభ్యులు ఎం.వినోద్, గొరకల బాలకృష్ణ, పోతనపల్లి కుసుమ, ఆర్.మాధవరావు, పైల అప్పారావు, కృష్ణప్రసాద్, ఎస్.రామారావు, అప్పయ్య, ప్రసాద్, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

36 రోజుల తర్వాత స్వగ్రామానికి మృతదేహం


మృతదేహంవద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు


భుజంగరావు(ఫైల్)

కవిటి: మండలంలోని ఆర్.బెలగాం గ్రామానికి చెందిన తిప్పన భుజంగరావు(43) ఇరాక్‌లో ఉద్యోగానికి వెళ్లి మార్చి 6న ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఎట్టకేలకు మృతదేహం శుక్రవారం గ్రామానికి చేరుకోవడంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఇరాక్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో నాలుగేళ్లుగా పనిచేస్తున్న భుజంగరావు అమ్మోనియా ట్యాంకర్ సమీపంలో పేలుడు కారణంగా మృతిచెందిన విషయం తెలిసిందే. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ అశోక్ చొరవతో మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. భుజంగరావు మృతదేహాన్ని చూసిన తల్లి దమయంతి, భార్య జయలక్ష్మి, కుమార్తెలు రిషీ, దీక్ష కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఉద్యోగిని దూషించిన కేసులో రెండేళ్ల జైలుశిక్ష

రణస్థలం : విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగిని దూషించిన కేసులో బలగ చిరంజీవి అనే వ్యక్తికి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద రెండేళ్ల జైలు శిక్ష, రూ.11వేలు అపరాధ రుసుం విధిస్తూ తీర్పు వెలువడిందని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. 2020 డిసెంబర్ 4న రణస్థలం మండలం తెప్పలవలసలో వీఆర్‌ఓ పేదలందరికి ఇళ్ల స్థలాల పంపిణీ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు హద్దురాళ్లు తీసేశారు. సమాచారం అందిన వెంటనే సచివాలయ సిబ్బంది, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌తో కలిసి అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో బలగ బుచ్చిబాబు, బలగ శ్రీను, మహేష్, రమణ, చిరంజీవి, యాగాటి లక్ష్మణరావు, భోగాపురపు సింహాచలం, ముక్కు అసిరయ్య, బంగారపు సూరప్పడులు హద్దురాళ్లు తొలగించినట్లు గుర్తించారు. ఈ విషయమై తహశీల్దార్‌కు సమాచారం ఇచ్చే సమయంలో వీఆర్‌ఓను బలగ చిరంజీవి అనే వ్యక్తి కులం పేరుతో దూషించాడు. దీంతో బాధిత వీఆర్‌ఓ జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై ఈ.శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ ఎం.మహేంద్ర కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం నిరూపితం కావడంతో చిరంజీవికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పునిచ్చింది.

జీడిమామిడి.. తగ్గిన దిగుబడి

- ఉద్దాన ప్రాంత రైతుల్లో అలజడి
- 38,930 ఎకరాల్లో చీడపీడల బెడద
- అకాల వర్షంతో మరింత నష్టం
- పెట్టుబడులు కూడా రావడం లేదని రైతుల ఆవేదన

వజ్రపుకొత్తూరు: వాతావరణంలోని అసమానతలు, వేసవి వచ్చాక కూడా దట్టంగా కురిసిన మంచు, చీడపీడలు, ఇటీవల కురిసిన అకాల వర్షం ఈ ఏడాది జీడి మామిడి రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. ఎకరాకు కనీసం ఐదు బస్తాలు (బస్తాకు 80 కిలోలు) దిగుబడి ఆశించిన రైతులు ప్రస్తుతానికి ఒకటి రెండు బస్తాలతో సరిపెట్టుకుంటున్నారు. ఇంత దారుణమైన పరిస్థితి గతంలో ఎన్నడూ లేదని పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలకరి వర్షాలు కురవగానే తోటల్లో ఆకులు, పిచ్చి మొక్కల తొలగింపు, దుక్కులు దున్ని చెట్టు మొదల్లో రసాయన ఎరువులు వేయడానికి ఎకరాకు సుమారు రూ.25 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారు. ఇప్పుడు రెండు బస్తాలు దిగుబడి కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇళ్లల్లో శుభకార్యాలు చేయాలంటే రెండు ఎకరాలు జీడిమాడి తోట ఉంటే చాలు ఖర్చులకు వెనుకాడనవసరం లేకుండా ఉండేదని, ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెబుతున్నారు. చేసిన అప్పులు ఏటా పెరిగిపోతూ ఆదాయం లేక అప్పులు పాలవుతున్నామని ఆందోళన చెందుతున్నారు.

అవగాహన కరువై..

జీడి మామిడి పంట పూత, పిందె దశలో ఉండగా తోటలపై సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుత పూత నల్లగా మాడిపోవడం, పిందె పెరగకపోవడం, పిండి నల్లి తెగులు కారణంగా జీడిపండు పిక్కకు బూజు సోకడం, దోమపోటు కారణంగా చెట్టు మొత్తం ఎండిపోయి పాడైపోవడం వంటి పరిణామాలు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడ, కొత్తపేట, అమలపాడు, యూఆర్‌కేపురంతో పాటు పలాస, సీతంపేట, కవిటి, కంచిలి, మందస, రణస్థలం ప్రాంతాల్లో ఎక్కువగా నష్టం ఉంది. ఏ మందు ఎంత మోతాదులో వాడితే మంచి ఫలితం ఉంటుందో ఉద్యానవన శాఖ అధికారులు తమకు అవగాహన కల్పించడం లేదని కొందరు రైతులు చెబుతున్నారు. వాస్తవానికి ఈ ప్రక్రియ ప్రాథమిక దశలోనే జరగాలి. కానీ ఉద్దానం ప్రాంతంలో ఉద్యానవన శాఖ ద్వారా జీడిమామిడి రైతులకు సలహాలు సూచనలు మొక్కుబడిగా ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఐదు మండలాలకు ఒకే ఒక్క ఉద్యానవన శాఖ అధికారి ఉండటం వల్ల కూడా రైతులకు సలహాలు, సూచనలు సకాలంలో అందని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత సీజన్‌లో రైతులకు చేరువగా, పంటను కాపాడేందుకు ఉండాల్సిన విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు చాలా మంది సచివాలయాలకే పరిమితమవుతున్నారని జీడిమామిడి రైతులు వాపోతున్నారు. దీంతో చాలామంది రసాయన మందులపై అవగాహన లేక ఇష్టానుసారంగా పురుగు మందు పిచికారీ చేస్తున్నారు. దీని వల్ల తోటల్లో పూత మాడిపోయి పిందె రాకుండా పోయిందని రైతులు చెబుతున్నారు.


కొమరల్తాడలో జీడి పంటకు తెగులు సోకడంతో ఎండిపోయిన పూత


వజ్రపుకొత్తూరు ప్రాంతంలో నల్లగా మాడి పిందె దశలోనే ఉన్న జీడి పంట

దెబ్బకొట్టిన వర్షాభావం..

జిల్లాలో దాదాపు రెండున్నర నెలలుగా వర్షం కురవకపోవడం, అకాల వర్షం ప్రభావం జీడి మామిడి పంటపై పడిందని రైతులు చెబుతున్నారు. జీడిమామిడి తోటలకు నీరు పెడితే మంచి కాపు ఇస్తుందని ఉద్యానవన శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ప్రస్తుతం జీడిమామిడి తోటలు అధికంగా ఉద్దానం, కొండపోడు భూములు, రాళ్ల ప్రదేశాల్లో సాగు చేస్తున్నారు. ఈ తరహా తోటలకు నీరు అందే అవకాశం ఏమాత్రం లేకపోవడం కూడా జీడిమామిడి పంటల దిగుబడి తగ్గిపోవడానికి కారణమని రైతులు చెబుతున్నారు. వరుసగా మూడేళ్లుగా పంట నష్టం వాటిల్లడంతో, ఇక జీడిమామిడి తోట సాగు వృథా అనే నిర్ణయానికి వచ్చిన రైతులు చాలా తోటలను నరికి కలపగా విక్రయిస్తున్నారు. జిల్లాలో దాదాపు 38,930 ఎకరాల్లో జీడి మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఇటీవల చెట్లు జీర్ణావస్థకు వచ్చి మరికొన్ని చోట్ల తోటలను నరికివేయడం వల్ల జీడిమామాడి తోటల విస్తీర్ణం జిల్లాలో 10 వేల ఎకరాలకు పడిపోయిందని పలువురు చెబుతున్నారు.

ధరల పతనం..

జిల్లాలో వజ్రపుకొత్తూరు మండలంలో 11706, మందసలో 8069, పలాసలో 4575, రణస్థలంలో 1720, సోంపేటలో 1950, కంచిలిలో 1173, సీతంపేటలో 6539, కవిటిలో 1270, ఎచ్చెర్లలో 1935 ఎకరాల్లో రైతులు జీడిమామిడి పంట సాగు చేస్తున్నారు. గత రెండు వారాల్లో జీడి మామిడి ధర రోజు రోజుకూ తగ్గుతూ వస్తోంది. సీజన్ తొలి రోజుల్లో (బస్తా 80 కిలోలు) రూ.14000 పలకగా.. ప్రస్తుతం రూ.12వేలు (కిలోరూ.150)కు పడిపోయింది. అసలే పంట దిగుబడి లేక దిగాలు పడ్డ రైతులు ధర కూడా తగ్గిపోవడంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు. జీడి మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆశలు ఆవిరి..



జీడి పంటపై పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. ఎకరాకు ఆరు బస్తాలు దిగుడి వస్తుందని భావించాం. వాతావరణంలో మార్పులతో పిందె మాడిపోయి పిక్కలకు బూజు పట్టి దిగుబడిపై ప్రభావం చూపింది. ఎకరాకు ఒక బస్తా కూడా రాని పరిస్థితి వచ్చింది.

– దున్న నాగేశ్వరరావు, యూఆర్‌కేపురం, వజ్రపుకొత్తూరు మండలం

శాస్త్రవేత్తలను తెచ్చాం



వజ్రపుకొత్తూరు పూండి ఉద్దానం ప్రాంతంలో సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు పెద్దపేట, జీడిపరిశోధన కేంద్రం(బాపట్ల) నుంచి శాస్త్రవేత్తలను తెప్పించి రైతులకు అవగాహన కల్పించాం. ఐదు మండలాలకు ఉద్యానవన శాఖ అధికారిగా ఉన్నాను. వాతావరణంలో మార్పులకు ఎవరూ ఏమీ చేయలేరు.పిండి నల్లి ఉధృతంగా ఉండటం వల్ల రైతులకు నష్టం వాటిల్లింది. మందులు ఏం వాడాలో రైతులకు వివరించాం. – కె.సునీత, ఉద్యానవన శాఖ అధికారి

సూదికొండలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండలో వారం రోజులుగా అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని, తక్షణమే వాటిని నిలిపివేయాలని స్థానికులు శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కొంతమంది గ్రావెల్ తవ్వకాలు చేసి కంకర తరలించిన సమయంలో గ్రామస్తులు, ప్రజాసంఘాలు, పర్యావరణ ప్రేమికులు అడ్డుకున్నాయని గుర్తు చేశారు. తవ్వకాలకు వ్యతిరేకంగాపురపాలక సంఘం సమావేశంలో కౌన్సిల్ తీర్మానం కూడా ఆమోదం జరిగిందన్నారు. అనంతరం కలెక్టర్‌కు తీర్మానం పంపించి గ్రావెల్ తవ్వకాలు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ఇప్పుడు కేంద్రీయ విద్యాలయం నిర్మాణం పేరిట మళ్లీ తవ్వకాలు జరపడం తగదన్నారు. అనంతరం ఆర్డీఓ వెంకటేష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, పార్టీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంబటి ఆనందరావు, సీపాన శ్రీరాములు, సీపాన అఖిల్, బగాది సింహాచలం, సీపాన లోకేష్, కోనారి ఆది, మల్ల దిలీప్, జోగి పవన్, దుమ్ము రాజు, పిన్నింటి యర్రంనాయుడు, కూన చిన్న, పొన్నాన చిన్నారావు, దుర్గారావు, బాబూరావు, సింహాచలం, అసిరయ్య, తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


తవ్వకాలు ఆపాలంటూ ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

తల్లికి తలకొరివి పెట్టిన తనయ


తలకొరివి పెడుతున్న నాగమ్మ

కంచిలి: మండలంలోని చిన్నకొజ్జిరియా గ్రామానికి చెందిన పొందల జగన్మోహిని(75) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందగా కుమార్తె నాగమ్మ తలకొరివి పెట్టింది. కుమారుడు శివాజీ బెంగళూరులో జీవనోపాధి పొందుతున్నాడు. దీంతో అవివాహితురాలైన కుమార్తె నాగమ్మ హాజరై అంత్యక్రియలు పూర్తి చేసింది.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గంగా ప్రియదర్శిని అన్నారు. ఎచ్చెర్ల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు పుట్టినప్పటి నుంచి వెయ్యి రోజుల వరకు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి


మృతుడు కిక్కర అప్పలస్వామి

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామానికి చెందిన కిక్కర అప్పలస్వామి (89) అనే వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మర్రిపాడు-సి గ్రామపరిసర ప్రాంతాల్లోని పంటపొలాల్లో సువ్వ పంట తీసేందుకు స్థానిక రైతులు వెళ్లగా.. అప్పలస్వామి శవమై కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి ఎస్సై బి.లావణ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కోడలు కిక్కర చిన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పలస్వామికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు వలస కూలీలుగా వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. భార్య కొన్నాళ్ల క్రితమే మృతిచెందింది. మూడు రోజులుగా అప్ప ల స్వామి కనిపించడంలేదని గ్రామస్తులు చెబుతున్నారు. కుటుంబ సభ్యులు స్థానికంగా లేకపోవడంతో లేకపోవడంతో ఎక్కడో ఉంటాడని భావించారు. గురువారం పెద్దకోడలు గ్రామానికి వచ్చింది. ఇంతలో మృతదేహం శుక్రవారం వెలుగుచూడటంతో ఆమె పోలీసులకు ఫిర్యా దు చేసింది. మృతికి గల కారణాలు తెలియలేదు.

తనిఖీలకు రమ్మన్నారు.. వస్తే పొమ్మన్నారు..

- ఆమదాలవలస సీహెచ్‌సీ వద్ద దివ్యాంగుల ఆవేదన


ఆమదాలవలస సీహెచ్‌సీ వద్ద దివ్యాంగులు

ఆమదాలవలస: వికలాంగత్వం పునఃపరిశీలన కోసం ఆమదావలసలోని జొన్నవలస సీహెచ్‌సీకి ఈ నెల 11న హాజరుకావాలంటూ నందిగాం మండలం హరిదాసుపురం సచివాలయం పరిధిలోని పలువురు దివ్యాంగ పింఛనుదారులకు ఈ నెల 1న ఉత్తర్వులు అందించారు. దీంతో హరిదాసుపురం గ్రామానికి చెందిన బమ్మిడి సావిత్రి, గుంట హేమాచలం, నర్సిపురం నారాయణ, చెరుకుపల్లికి చెందిన మామిడి సంతు, రాజాం చంద్రయ్య, ప్రతాప విశ్వనాథపురం గ్రామానికి చెందిన పనిల రామస్వామిలు తీవ్ర వ్యయ ప్రయాసలకు ఓర్చి, మండుటెండలో ప్రయాణించి శుక్రవారం ఆమదాలవలసలోని ఆస్పత్రికి చేరుకున్నారు. అయితే సిబ్బంది మాత్రం ఇక్కడ ఎటువంటి వికలాంగత్వ పరీక్షలు చేపట్టలేదని, మీ వద్ద ఉన్న ఉత్తర్వులతో తమకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. దీంతో దివ్యాంగులు ఉసూరుమన్నారు. తమకు ఉసురు అధికారులకు, ప్రభుత్వానికి తప్పక తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. తమకు ఇటువంటి పరిస్థితి తీసుకొచ్చిన వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొంతసేపయ్యాక, వీరి ఆవేదనను చూసిన ఆస్పత్రి సిబ్బంది పాతపట్నం సీహెచ్‌సీకి వెళ్లమని చెప్పి అక్కడి సిబ్బందితో ఫోన్‌లో పునఃపరిశీలన చేయించారు.

బీసీల కోసం సివిల్స్ స్టడీ సర్కిల్

- పూలే జయంతి వేడుకలో మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : బీసీల కోసం జిల్లాలో సివిల్ సర్వీసెస్ కోసం స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి చేస్తామని, జిల్లా కేంద్రం రూపురేఖలు మారుస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం పొన్నాడ బ్రిడ్జి వద్ద పూలే విగ్రహానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, బీసీ సంఘం నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాంబే కాలనీ వద్ద నిర్మించిన వెనుకబడిన తరగతుల సంక్షేమ భవన సముదాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన సముదాయంలో పైన రెండు గదులు ఏర్పాటు చేసి ఐఏఎస్, ఐపీఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు సంబంధిత మంత్రితో మాట్లాడుతానన్నారు. అనంతరం బీసీ స్వయం ఉపాధి పథకం కింద 435 మందికి రూ.8,05,05,000 రుణాలు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు పైడిశెట్టి జయంతి, బీసీ కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణమూర్తినాయుడు, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, తహసీల్దార్ గణపతిరావు, బీసీ సంక్షేమ శాఖాధికారి అనూరాధ, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పీఎంజే బాబు, బీసీ, ఎస్సీ, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్

ఆదిత్యుని సన్నిధిలో దత్త విజయానందతీర్థ స్వామి

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని శ్రీదత్త విజయానంద తీర్థ స్వామీజీ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయంగా ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఈ సందర్భంగా అనివెట్టి మండపంలో స్వామీజీ మాట్లాడుతూ విశ్వలోకాల రక్షకుడు, ప్రత్యక్షదైవం సూర్యనారాయణ స్వామి ఇక్కడ కొలువుతీరడం నిజంగా అదృష్టమని..ఆరోగ్య ప్రదాత సూర్యభగవానుడని వివరించారు. ఆదిత్యుని వార్షిక కల్యాణ మహోత్సవాలు (బ్రహ్మోత్సవాలు) జరుగుతున్నాయని ప్రధానార్చకులు శంకరశర్మ తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పి లి సాందీప్ శర్మ, ఫణీంద్రశర్మ పాల్గొన్నారు.


అనివెట్టి మండపంలో విజయానంద తీర్థ స్వామీజీ

ట్యాక్సీ కార్మికుల ఆందోళన


పంచాయతీ అధికారులు, పోలీసులతో మాట్లాడుతున్న ట్యాక్సీ స్టాండ్ కార్మికులు

టెక్కలి: టెక్కలి వైఎస్సార్ జంక్షన్‌లో ట్యాక్సీ స్టాండ్ తొలగింపును వ్యతిరేకిస్తూ కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పట్టుమహాదేవి కోనేరు గట్టు అభివృద్ధిలో భాగంగా మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో ట్యాక్సీ స్టాండ్ తొలగింపు కోసం అధికార యంత్రాంగం సిద్ధమయ్యారు. ఈ క్రమంలో పంచాయతీ అధికారులు యంత్రాలతో సహా ట్యాక్సీ స్టాండ్ వద్దకు చేరుకున్నారు. దీంతో ట్యాక్సీ కార్మికులు అడ్డుకుని వ్యతిరేకించారు. తమకు ప్రత్యామ్నాయం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, ఇప్పుడు హఠాత్తుగా వచ్చి స్టాండ్ తొలగిస్తామనడం సమంజసం కాదని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రాము, సిబ్బంది ట్యాక్సీ స్టాండ్ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తామంతా మంత్రిని కలిసి సమస్య వివరిస్తామని, ఆ తరువాత స్టాండ్ తొలగింపు నిర్ణయం తీసుకోవాలని కార్మికులు పట్టుబట్టడంతో అధికారులు వెనుదిరిగారు. కాగా, దశాబ్దాలుగా ఇదే స్థలంలో ట్యాక్సీ స్టాండ్ ద్వారా కార్మిక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, ఇప్పుడు స్టాండ్ తొలగిస్తే కుటుంబాలతో సహా ఇబ్బందులు పడతామని పలువురు కార్మికులు వాపోయారు.

పిక్కాట శిబిరంపై దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రామంలో శుక్రవారం అట్టపిక్కల శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. అట్ట పిక్కలు, రూ.700 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు చెల్లబోయిన అప్పలసూరిపై కేసు నమోదు చేశారు.

మాక్‌డ్రిల్.. సూపర్ థ్రిల్..


మాక్‌డ్రిల్‌లో భాగంగా ప్రథమ చికిత్స చేస్తున్న వైద్యులు

రణస్థలం మండలం జీరుపాలెంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో తుఫానులు – వరదలపై 16 శాఖల అధికారుల సమక్షంలో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. భూకంపం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, చెట్లు కూలిపోవడం, వరదలు, గ్యాస్ పేలుడు వంటి ఘటనలు సంభవించినప్పుడు ఏ విధంగా స్పందించాలో కళ్లకు కట్టినట్లు చేసి చూపించారు. ఒక్కొక్కొ శాఖ అధికారులు డ్రిల్ చేసి ఆకట్టుకున్నారు. ఎస్‌డీఎంఏ నోడల్ అధికారి పి.రాము ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపకాధికారి జె.మోహన్‌రావు, తహసీల్దార్ ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. –రణస్థలం



క్షతగాత్రుడిని తరలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది


కూలిన భవనం వద్ద సహాయక చర్యలు చేపడుతూ.


నేలకూలిన చెట్లు తొలగింపు చేపడుతూ..